అంబేడ్కర్ ఆశయాలు జగన్‌తో సాకారం

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- మూడు నియోజకవర్గాల్లో ఘనంగా రాజ్యాంగ నిర్మాత జయంతి
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, దళిత సంఘాలు

దేవరపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు తీసుకువెళుతున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దళిత బాంధవుడు అంబేడ్కర్ జయంతి శుక్రవారం నిడదవోలు క్లస్టర్‌లో అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని సుబ్బరాయపురం, దేవరపల్లిలోని అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే తలారి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాల మేరకు దివంగత సీఎం రాజశేఖరరెడ్డి పాలన సాగించారన్నారు. తండ్రి బాటలో జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. అంబేడ్కర్ భిక్షతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు విద్య, ఉదోగ్య, రాజకీయ పదవుల్లో రిజర్వేషన్లు పొందుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచులు శ్రీరంగం రామలక్ష్మి, కడిమి వీరకుమారి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఎంపీటీసీ సభ్యులు కడలి చిట్టిబాబు, సత్తి జగదీశ్వరరెడ్డి, పల్లికొండ రామలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కడలి హైమావతి, దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు, పలువురు పార్టీ నాయకులు, ఆంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్ర పటానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంపీడీఓ కె. ఉమామహేశ్వరశర్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గోపాలపురం: అంబేడ్కర్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు. గోపాలపురం సచివాలయంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని రాజ్యాంగ నిర్మాతకు నివాళి అర్పించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, వివిధ గ్రామాల్లో అంబేడ్కర్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పండుగలా నిర్వహించారు. గోపాలపురం పెద్దగూడెం, వాదాలకుంట గ్రామాల్లో భారీ అన్న సమారాధనలు జరిగాయి.


దేవరపల్లి మండలం సుబ్బరాయపురంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే తలారి తదితరుల నివాళి

ఆయన జీవితం అందరికీ ఆదర్శం

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఏలూరు జిల్లా కలెక్టర్ వై. ప్రసన్న వెంకటేష్ , గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, బొండాడ వెంకన్నబాబు, పంచాయతీ సర్పంచ్ ప్రత్తిపాటి యోహాను, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఝాన్సీరాణి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, దళిత సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్ల పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కారుమంచి రమేష్, మద్దిపాటి ప్రసాద్, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ ఆరుగొల్లు మణి, సర్పంచ్ పల్లి జ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు మేణ్ని వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ రాయుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. చీపురుగూడెంలో నిర్వహించిన జయంతి వేడుల్లో కొరపాటి వెంకటరత్నం, హరిప్రసాద్, రావూరి వెంకటరమణ, బంక అప్పారావు, చెల్లు వీరవెంకట్రావు, గగ్గర శ్రీనివాస్, పిచ్చుకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దూబచర్ల జంక్షన్‌లో సర్పంచ్ బాలయ్య, ఉప సర్పంచ్ బాటయ్య తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు వివిధ గ్రామాల్లో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకలకు హాజరయ్యారు. నల్లజర్ల పశువుల ఆసుపత్రి సెంటర్‌లో సీఐ లక్ష్మణరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం తాళ్లపూడి, ప్రక్కిలంక, అన్నదేవరపేట, గజ్జరం, పెద్దేవం, తిరుగుడుమెట్ట, తాడిపూడి తదితర గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ పాల్గొన్నారు. వేగేశ్వరపురంలో నవ చైతన్య యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, ఎస్సై కె.వెంకటరమణ తదితరులు అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. అనంతరం కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. తాళ్లపూడి వేడుకల్లో జెడ్పీ వైస్ చైర్మన్ పోశిన శ్రీలేఖ, ప్రక్కిలంకలో సర్పంచ్ యాళ్ల స్వప్న, యూత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సై కె. వెంకటరమణ, గూడా విజయరాజు, యాళ్ల బాబురావు, యూత్ సభ్యులు పాల్గొన్నారు. తిరుగుడుమెట్టలో ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, యూత్ పాల్గొన్నారు. గ్రామాల్లో యూత్ ఆధ్వర్యంలో మోటారు సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో తాళ్లపూడి, తిరుగుడుమెట్ట, పెద్దేవం, రావూరుపాడు గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గంటా కృష్ణ పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. పట్టణంలోని సంత మార్కెట్, సుబ్బారాజుపేట, జ్యోతి కాలనీ, పోలీస్ స్టేషన్‌లోని అంబేడ్కర్ విగ్రహాలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహాలకు నియోజకవర్గ కన్వీనర్ బండి సత్యనారాయణ, మండల కన్వీనర్ మాట్ల వెంకట దుర్గారావు, మండల ఇన్‌చార్జ్ షఫీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేఏపీఎస్ ఆధ్వర్యంలో సమిశ్రగూడెంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు.


సమిశ్రగూడెంలో అంబేడ్కర్ చిత్ర పటానికి ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సూరిబాబు నివాళి


దమ్మెన్నులో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణలో జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

నిడదవోలు రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు, అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నిడదవోలు మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, ఎంపీడీఓ టి.మూర్తిబాబు, ఎంపీటీసీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమిశ్రగూడెంలో అంబేడ్కర్ ఉత్సవ కమిటీ, ఆదర్శ, జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. తాడిమళ్ల, కోరుమామిడిలో అంబేడ్కర్ విగ్రహానికి జైభీమ్ యూత్ సభ్యులు, మునిపల్లిలో ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, అట్లపాడులో జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు పూలమాలలు వేసి నివాళుర్పించారు. గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని దమ్మెన్ను గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పొలాటి యల్లారేశ్వరి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు గెద్దం రామకృష్ణ పాల్గొన్నారు. వేలివెన్నులో జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరామయ్య, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొలాటి యల్లారేశ్వరి, ఎంపీడీఓ ఎ. శ్రీనివాసు అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు ఆర్పించారు.

అంబేడ్కర్ ఆశయాల మేరకు యువత పనిచేయాలి

చాగల్లు: మండలంలోని మల్లవరంలో అంబేడ్కర్ విగ్రహానికి హోం మంత్రి తానేటి వనిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాసామ్యబద్ధంగా నేటి యువత అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. చాగల్లులోని జైభీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. బ్రాహ్మణగూడెం ఎస్సీ ఏరియాలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, జెడ్పీటీసీ సభ్యుడు గారపాటి విజయదుర్గ, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


చాగల్లు మండలం మల్లవరంలో అంబేడ్కర్ విగ్రహానికి హోంమంత్రి తానేటి వనిత నివాళి

దళితవాడల్లో 20 సామాజిక భవనాలు

- నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


తలారి వెంకట్రావు

దేవరపల్లి: దళిత వాడల్లో కల్యాణ మండపాలు, సామాజిక భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాల్లో సామాజిక భవనాలు, కల్యాణ మండపాలు నిర్మిస్తామని చెప్పారు. ఒక్కొక్క భవనానికి రూ.25 లక్షల చొప్పున నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 20 భవనాలకు రూ.5 కోట్లు మంజూరైనట్టు వివరించారు. నియోజవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేకు కేటాయించిన రూ. 2 కోట్ల నుంచి కల్యాణ మండపాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. తన ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేశామన్నారు. డ్రైనేజీలు, పైపులైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం, ఎస్సీ శ్మశానవాటికల అభివృద్ధి, ఎస్సీ కమ్యూనిటీ భవనాలకు రూ.1.50 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. కాగా ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.11.40 కోట్లు మంజూరయ్యాయన్నారు. కరోనా కారణంగా నిలిచిపోయిన నిధులు తిరిగి మంజూరైనట్టు చెప్పారు. జల జీవన్ మిషన్ కింద ఇంటింటికీ మంచినీటి కుళాయి ఇచ్చే కార్యక్రమం నియోజకవర్గంలో ముమ్మరంగా జరుగుతోందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులు కేటాయిస్తున్నట్టు చెప్పారు. దేవరపల్లి మండలం సుబ్బరాయపురంలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ.5 లక్షలు, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ భవనానికి రూ.5 లక్షలు, ధుమంతునిగూడెంలో ఎస్సీ సామాజిక భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేసినట్టు వివరించారు.

జగన్ పాలనపై సంతృప్తి.. భవిష్యత్తుపై భరోసా

నిడదవోలు రూరల్: ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను చూసి జగనన్నే మా భవిష్యత్తు అని ప్రజలు అంటున్నారని మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని 24 వార్డులలోను, మండలంలోని రావిమెట్ల, కంసాలిపాలెం, గోపవరం, విజ్జేశ్వరం, తాడిమళ్ల, కోరుమామిడి గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలను వివరిస్తూ ప్రజామద్దతు కూడగడుతున్నారు. కార్యక్రమాల్లో వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కానుబోయిన శేషు, వద్దిరెడ్డి శ్రీను, కోసూరి అప్పారావు, యాళ్ల రామారావు, ఉప్పులూరి రామకృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు స్థానిక నాయకులు పాల్గొన్నారు.


రావిమెట్లలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు


బ్రాహ్మణగూడెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చాగల్లు: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. బ్రాహ్మణగూడెంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నాడ సింహాద్రి, ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ చిలకా నారాయణ, జంగం బాబూరావు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి
- పంగిడిగూడెంలో క్రికెట్ టోర్నీ విజేత జట్టుకు బహుమతుల ప్రదానం

ద్వారకాతిరుమల: యువత క్రీడల్లో రాణించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పంగిడిగూడెంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఐదు టీమ్‌లు పాల్గొన్న ఈ టోర్నీలో సూర్యచంద్రరావుపేట టీమ్ విజయం సాధించింది. ఈ సందర్భంగా విజేత జట్టుకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు క్రికెట్ కిట్, షీల్డ్‌లను బహుమతులుగా అందజేశారు. అనంతరం టీం కెప్టెన్ పెనుబోయిన అశోక్, వైస్ కెప్టెన్ దూదిపాల నాగరాజులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, బొండాడ వెంకన్నబాబు, కన్నయ్య, మానుకొండ సుబ్బారావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, షేక్ బాషా, గుర్రాల లక్ష్మణ్, సర్పంచ్ ప్రత్తిపాటి యోహాను, గుమ్మడి శ్రీను తదితరులు పాలొన్నారు.


క్రికెట్ టోర్నీ విజేత జట్టుకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

వేగేశ్వరపురంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ

అంబేడ్కర్ ర్యాలీ సందర్భంగా వివాదం

తాళ్లపూడి: అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా మండలంలోని వేగేశ్వరపురంలో శుక్రవారం రాత్రి రెండు సామాజిక వర్గాల వారి మధ్య వివాదం చెలరేగింది. రెండువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నవ చైతన్య యూత్ ఆధ్వర్యంలో సాయంత్రం అంబేడ్కర్ జయంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గ్రామంలోని ప్రధాన కూడలి మీదుగా సాగుతున్నపుడు అక్కడున్న మరో వర్గం యువకులు కొన్ని కామెంట్లు చేయగా, ర్యాలీ చేస్తున్న యువకులు కూడా ధీటుగా జవాబిచ్చారు. ఇద్దరి మధ్యా చెలరేగిన వాగ్వాదం కాస్తా పరస్పరం రాళ్లు రువ్వుకునే వరకూ వెళ్లింది. ఈ క్రమంలో కొందరు యువకులకు గాయాలైనట్టు సమాచారం. కొద్ది సేపటి తర్వాత మండలంలోని ఇతర గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో అంబేడ్కర్ యూత్ సభ్యులు, మహిళలు వేగేశ్వరపురం చేరుకున్నారు. వారందరూ అంబేడ్కర్ విగ్రహం వద్ద బైఠాయించి జై భీమ్ అంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ, పోలీసు సిబ్బంది వారికి నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ వారు శాంతించలేదు. ర్యాలీపై రాళ్లు వేసిన యువకులను తమ వద్దకు తీసుకు రావాలని పట్టుబడుతున్నారు. అయితే మరోవర్గం వారు కూడా ర్యాలీ చేసిన వారు కూడా తమపై కూడా రాళ్లు విసిరారని, రోడ్డుపై ఉంచిన మోటార్ సైకిళ్లను ధ్వంసం చేశారని ఆరోపిస్తున్నారు. తమకు గాయాలయ్యాయని చెబుతున్నారు.


వేగేశ్వరపురంలో ఆందోళన చేస్తున్న అంబేడ్కర్ యూత్ సభ్యులు


వేగేశ్వరపురం కూడలిలో ఘర్షణ పడుతున్న రెండు వర్గాల యువకులు

'గడప గడపకూ'తో గ్రామాలకు వైభవం

- రూ.2.28 కోట్ల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణం
- మెరుగుపడుతున్న డ్రైనేజీలు
- నిధుల వినియోగంలో ముందంజలో దేవరపల్లి మండలం

దేవరపల్లి: 'గడప గడపకూ' నిధులతో గ్రామీణ రహదారులు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన కాలనీల రహదారులు ప్రస్తుతం సిమెంట్ రోడ్లుగా రూపుదిద్దుకుంటున్నాయి. తమ ప్రాంతాలోల సిమెంట్ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలను చూసి గ్రామీణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి గ్రామ సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, మంచి నీటి పైపులైన్ల నిర్మాణం చేస్తున్నారు. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో రూ.2.28 కోట్ల వ్యయంతో 68 రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. వాటిలో రూ.1.79 కోట్ల వ్యయంతో 60 రోడ్ల నిర్మాణాలు ఇప్పటికే పూర్తి చేశారు. మూడు మండలాల్లో 185 పనులకు రూ.5.38 కోట్ల వ్యయం కాగల అంచనాలను తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. వాటిలో మొదటి విడతలో 68 పనులకు రూ.2.28 కోట్లు మంజూరు చేసినట్టు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి తెలిపారు. నల్లజర్ల మండలంలో 62 పనులకు రూ.1.67 కోట్లు, దేవరపల్లి మండలంలో 75 పనులకు రూ.2.29 కోట్లు, గోపాలపురం మండలంలో 48 పనులకు రూ.1.41 కోట్లు ఖర్చయ్యే అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. నల్లజర్ల మండలంలో రూ.88.32 కోట్ల వ్యయంతో 32 రోడ్లు, దేవరపల్లి మండలంలో రూ.48.01 కోట్ల వ్యయంతో 16 రోడ్లు, గోపాలపురం మండలంలో రూ.43.42 కోట్ల వ్యయంతో నాలుగు రోడ్ల నిర్మణం పూర్తి చేశారు.


దేవరపల్లిలోని చంద్రబాబు కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డు

ఆ నిధులతో సీసీ రోడ్లు



గడపగడపకూ నిధులతో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేస్తున్నాం. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రోడ్ల నిర్మాణం జరుగుతుంది. ఇప్పటి వరకు రూ.1.79 కోట్ల వ్యయంతో 54 రోడ్లు నిర్మాణం పూర్తి చేశాం. మిగిలిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం జరుగుతున్నాయి. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కృషితో నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తాం.

– కె. బాలకృష్ణ, డీఈఈ, పంచాయతీరాజ్, గోపాలపురం

క్లుప్తంగా

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్, రాముడు, సిబ్బంది

కొవ్వూరు: వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపక అధికారి కె.రాముడు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అమరులైన అగ్నిమాపక సిబ్బందికి పట్టణంలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసే కరపత్రాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ కె.సాయికిరణ్ ప్రమాదాల బారినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈనెల 20 వరకూ ఈ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు ఎస్ఎఫ్‌వో రాముడు తెలిపారు. ప్రతి రోజూ ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

సొసైటీల చైర్మన్లుగా చామర్తి, పెన్మత్స


చామర్తి తమ్మిరాజు


పెన్మత్స వెంకట సుబ్బరాజు

ఉండ్రాజవరం: మండలంలో సూర్యారావుపాలెం, సత్యవాడ సొసైటీల త్రిసభ్య కమిటీ చైర్మన్లుగా చామర్తి తమ్మిరాజు, పెన్మత్స వెంకట సుబ్బరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సభ్యులుగా సూర్యారావుపాలెం సొసైటీకి గుల్లపల్లి ఉదయ భాస్కరరావు, ఘటోత్కజుడు, సత్యవాడ సొసైటీకి నాగోతు పోతురాజు, తాతిపర్తి నాగేశ్వరరావులను నియమించారు. ఈ సందర్భంగా తమ్మిరాజు, సుబ్బరాజులు తమను ఈ పదవుల్లో నియమించేందుకు సహకరించిన నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడికు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు.

పెండ్యాల సొసైటీ అధ్యక్షుడిగా రామచంద్రరాజు

నిడదవోలు రూరల్: మండలంలోని పెండ్యాల సొసైటీ నూతన అధ్యక్షుడిగా చేకూరి రామచంద్రరాజు, సభ్యులుగా వెలగన కనకయ్య, వాకా వీరవెంకట సత్యనారాయణలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రామచంద్రరాజును ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, పార్టీ నాయకులు, రైతులు, సొసైటీ సిబ్బంది శుక్రవారం అభినందించారు.

రోడ్డుపై గాయాలతో స్పృహ కోల్పోయిన వ్యక్తి


తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

దేవరపల్లి: మండలంలోని సూర్యనారాయణపురం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోయిన స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని స్థానికులు కనుగొన్నారు. పక్కనే ఏపీ16 ఐడి-0088 అనే నంబర్ గల బైక్ ఉంది. బైక్ పై వెళుతూ అతడు అదుపు తప్పి పడిపోయాడా? లేకా ఏదైనా వాహనం అతడిని ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయిందా? అనేది తెలియాల్సి ఉంది. స్థానికులు క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో చికిత్స కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలియవలసి ఉందని దేవరపల్లి ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. బైక్ నంబర్ గల వ్యక్తి ఆచూకీ తెలిస్తే దేవరపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఆకెళ్ల శివప్రసాద్‌కు కందుకూరి పురస్కారం

సీటీఆర్ఐ: ఆ నలుగురు, రంగమార్తాండ సినిమాలకు కథ, మాటలు రాసిన ఆకెళ్ల శివప్రసాద్‌కు కందుకూరి సాహితీ పురస్కారాన్ని అందజేస్తున్నట్లుగా కళాగౌతమి, తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. తన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక సంహిత కళాశాలలో ఆకెళ్లకు ఈ పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. అనేక టీవీ సీరియళ్లకు కథాసాహిత్యం అందించడమే కాకుండా, నవలలు, నాటకాలు, బాలసాహిత్యం, కథలు వంటి అనేక ప్రక్రియల్లో ఆకెళ్ల ప్రతిభ చూపారన్నారు. కార్యక్రమంలో బీవీఎస్ మూర్తి, భాను ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ జక్కంపూడి సత్యనారాయణ, తెలుగుశాఖాధిపతి డాక్టర్ పీవీ సంజీవరావు, ఆధ్యాత్మికవేత్త చెవ్వాకుల వంశీకృష్ణ, విద్యార్థి సంఘ నాయకుడు చర్ల సీతారామనాయుడు పాల్గొన్నారు.